## రూ.2 లక్షల నగదు సీజ్

గుడిపాల, మార్చి 26 ప్రభాతవార్త:



మండల పరిధిలోని గొల్లమడుగు తనిఖీ కేంద్రంలో ఎలాంటి బిల్లులు లేకుండా తీసుకెళ్తున్న 2 లక్షల రూపాయల నగదును ఎస్ఐ శ్రీనివాసరావు సీజ్ చేశారు. వేలూరు నుండి నెల్లూరుకు వెళ్తున్న ఒక చేపల వాహనంను పోలీసులు తనిఖీ చేయగా ఇందులో ఎలాంటి బిల్లులు లేకుండా 2 లక్షల నగదు పోలీసులకు లభించింది. ఎన్నికల కోడ్ అమలులో వుండటంతో ఈ మేరకు వాహనాల తనిఖీ నిర్వహిస్తున్న సమయంలో బిల్లులు లేకుండా 2 లక్షల రూపాయలు తీసుకెళ్తుండటంతో ఈ మొత్తంను సీజ్ చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎస్ఐ రాజేంద్ర, ఇతర పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి - చిత్తూరు



తెలుగు జాతీయ దినపత్రిక
వార్త




## అమ్మవారిని దర్శించిన సిజెఐ ధనంజయ్ చంద్రచుడ్

### స్వాగతించిన ఏపిసిజె ధీరజ్ సింగ్ ఠాకూర్

తిరుచానూరు, మార్చి 26, ప్రభాతవార్త

తిరుచానూరు పద్మావతి అమ్మవారిని సుప్రీం కోర్టు ఉన్నత న్యాయమూర్తి ధనంజయ్ చంద్రచుడ్ అమ్మవారి సేవలో పాల్గొన్నారు. వారిని హై కోర్టు ఉన్నత న్యాయమూర్తి దీరజ్ సింగ్ ఠాకూర్ స్వాగతించి వారితో పాటు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ప్రధాన ద్వారం నుండి వారికి ఘనంగా స్వాగతించి దర్శన ఏర్పాట్లు చేశారు. ముందుగా ధ్వజస్థంభం నమస్కరించారు. అనంతరం ఆలయ అర్చకులు వారికి ప్రత్యేక దర్శిన భాగ్యాన్ని కల్పించారు. ఆశీర్వాద మండపం వద్ద తిరుపతి జేఈఓ వీరబ్రహ్మం తీర్ధ ప్రసాదాలు అందజేసారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈఓ గోవిందరాజులు, ఏఈఓ రమేష్, విజిఓ బాలిరెడ్డి, సిఐ శ్రీకాంత్ రెడ్డి, ఎస్ఐ సుబ్బయ్య, సూపరింటెండెంట్ చంద్రశేఖర్, ఏవిఎస్ఓ సతీష్, విఐ ప్రతాప్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

# కుప్పానికి మరలా స్వర్ణయుగం తెస్తా

### ఐదేళ్లలో మరింత అభివృద్ధి చేసి నిజాయితీ నిరూపించుకుంటా ..
### పరిశ్రమలు తెస్తా.. హంద్రీ-నీవా జలాలు ఇస్తా !!
### తెదేపా అధినేత చంద్రబాబునాయుడు





తెలుగుయువత శ్రేణుల సమావేశంలో ప్రసంగిస్తున్న తెదేపా అధినేత చంద్రబాబునాయుడు, హాజరైన కార్యకర్తలు

కుప్పం, మార్చి 26 ప్రభాతవార్త

కుప్పం అంటే తనకు ప్రాణం అని, కుప్పానికి మరలా స్వర్ణయుగం తెస్తానని తెదేపా అధినేత నారా చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయం వద్ద తెలుగుయువత శ్రేణులతో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. తాను నామినేషన్ వేసేందుకు రాకున్నా తనను గెలిపిస్తున్నది కుప్పం ప్రజలేనన్నారు. కుప్పం ప్రజలు నీతి, నిజాయితీ ఉన్నవారని పేర్కొన్నారు. గత నలభై ఏళ్లలో జరిగిన అభివృద్ధి కన్నా వచ్చే ఐదేళ్లలో కుప్పాన్ని మరింత అభివృద్ధి చేసి తన నిజాయితీ నిరూపించుకుంటానని చంద్రబాబు పేర్కొన్నారు. అధికారంలోరాగానే కుప్పానికి పరిశ్రమలు తీసుకువస్తానని ప్రకటించారు. ఆగ్రో ప్రాసెస్ యూనిట్లు ఏర్పాటుచేస్తామన్నారు. రోజుకు 10లక్షల లీటర్ల పాలు ఉత్పత్తి అయ్యేలా పాడి పరిశ్రమకు ప్రోత్సాహం అందిస్తామన్నారు. కుప్పం రైల్వేస్టేషన్‌ను ఆధునీకరిస్తామని, కుప్పంలో ఎయిర్‌స్ట్రిప్ నిర్మించి రైతుల పంటలు, పూలు, కూరగాయలు ఎగుమతి అయ్యేలా చూస్తామని ప్రకటించారు. కుప్పం పట్టణంలో రోడ్లు, ఔటర్ రింగ్ రోడ్డు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు నిర్మించి బెస్ట్ టౌన్‌గా మార్చుతానని పేర్కొన్నారు. కుప్పంకు ఏడాదిలోనే హంద్రీ-నీవా కాలువల ద్వారా కృష్ణాజలాలు పూర్తిస్థాయిలో తెస్తామని పేర్కొన్నారు.

నేను నమ్మేది ప్రజలనే : వైఎస్సార్సీ పార్టీ రౌడీయిజాన్ని నమ్ముకుందని తాను ప్రజలనే నమ్ముతానని చంద్రబాబుపేర్కొన్నారు. ఐదేళ్ల వైకాపా పాలనలో కుప్పంలో కెజిఎఫ్ గనులను మరిపించేలా గ్రానైట్ సంపదను దోచారని పేర్కొన్నారు. కుప్పంలో తననే రానీయకుండా చేయాలని చూడడంతో పాటు అన్న క్యాంటీన్‌ను ధ్వంసం చేశారన్నారు. తన లాంటివారిపైనే కేసులు పెట్టారని, ఇక రాష్ట్రంలో సామాన్యుల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. కుప్పంలో పేటిఎం బ్యాచ్ తయారైందన్నారు. కుప్పంలో ఆస్తులు, సంపద కొల్లగొట్టారని విమర్శించారు.గుండిశెట్టిపల్లి వద్ద బసవేశ్వరస్వామి ఆలయ భూములు ఐదెకరాలు కొట్టేయాలని చూస్తున్నారన్నారు. వైఎస్ పాలనలో, జగన్ పాలనలో కుప్పంపై శీతకన్ను వేశారని, అభివృద్ధి ఆపేశారని పేర్కొన్నారు. కుప్పంలో ఈసారి లక్ష ఓట్ల మెజార్టీ రావాలని చంద్రబాబు పిలుపునిచ్చారు.నలభై ఐదు రోజుల పాటు యువత కష్టపడి చేయాలన్నారు. వైకాపాను చిత్తుచిత్తుగా ఓడించి భూస్థాపితం చేయాలని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్, చిత్తూరు ఎంపి అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాద్‌రావు, జిల్లా తెదేపా అధ్యక్షుడు సిఆర్ రాజన్, కుప్పం ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం, పరిశీలకుడు ఖాదర్ బాషా, రాష్ట్ర కార్యదర్శి డా॥ బిఆర్ సురేష్‌బాబు, తెలుగుయువత కోఆర్డినేటర్ సత్యేంద్రశేఖర్, క్లస్టర్ ఇన్‌చార్జ్ ప్రతాప్, మహిళా నాయకురాలు భారతి, తెలుగుయువత, ఐటిడిపి నేతలు మణి, వెంకీ, పార్థసారథి, శరవణ, బాలు, మునెప్ప,బాలాజీ, నరేష్,అశోక్ తదితరులు పాల్గొన్నారు.

### న్యాయశాస్త్ర అధ్యయనం

## సామాజిక బాధ్యత కావాలి

### ఎస్వీయూలో సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్




తిరుపతి క్రీడ, మార్చి 26, ప్రభాతవార్త

న్యాయశాస్త్ర అధ్యయనం సామాజిక బాధ్యత కావాలని సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్ పేర్కొన్నారు. మంగళవారం ఎస్వీయూలో న్యాయశాస్త్ర విభాగం ఐదు సంవత్సరాల కోర్సు ప్రారంభించి దశాబ్ధి కాలమైన సందర్భంగా నిర్వహిస్తున్న ఉత్సవాలకు సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డా. డి.వై. చంద్రచూడ్ ముఖ్య అతిథిగా హాజరైయ్యారు. శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం శ్రీనివాస ఆడిటోరియంలో ఐదేళ్ల న్యాయ విభాగం దశాబ్ధి ఉత్సవాలను వారు ప్రారంభించారు. దాదాపు 1500 మంది పై చిలుకు విద్యార్ధులకు వారు తన ఉపన్యాసం ద్వారా దిశానిర్దేశం చేశారు. న్యాయశాస్త్ర అధ్యయనం ప్రజలకు సేవ చేసేందుకు ఉపయోగించే ఒక మంచి ఔషధం కావాలని, సామాజిక బాధ్యత కావాలని కాబోయే న్యాయవాదులను ఉద్దేశించి అన్నారు. ఎస్వీయూ వైస్ చాన్సలర్ ఆచార్య వి. శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ వెనుకబడిన రాయలసీమ సీమలో స్థాపించిన ఈ విశ్వవిద్యాలయం 70 సంవత్సరాల పయనంలో ఎన్నో మైలు రాళ్ళు చేరుకుందని, నేడు రాష్ట్ర విశ్వవిద్యాలయాల్లో రెండవ స్థానంలో ఉందని తెలిపారు. ఎస్వీయూ రిజిస్ట్రార్ ఆచార్య మహమ్మద్ హుస్సేన్ సైన్స్, కృత్రిమ మేథ రంగాల్లో నూతన కోర్సులు ప్రారంభించిందని తెలిపారు. ఎస్వీయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పద్మనాభం, ఐదు సంవత్సరాల న్యాశాస్త్ర కోర్సు డీన్ ఆచార్య విఆర్‌సి కృష్ణయ్య లా కోర్సు నిర్వహిస్తున్న విధి విధానాలను గురించి తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఎస్వీయూలోని ఐదు సంవత్సరాల న్యాయశాస్త్ర విభాగ విద్యార్ధులు నిర్వహించగా, న్యాయశాస్త్ర అధ్యాపకులు, జిల్లాలోని వివిధ న్యాయ శాస్త్ర కళాశాల విద్యార్ధులు పాల్గొన్నారు.

### రూ.10 లక్షలకు పైగా జరిగే

## ఆర్థిక లావాదేవిలపై నివేదికలు

### బ్యాంకర్ల సమావేశంలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సగిలి షన్మోహన్



చిత్తూరు, మార్చి 26 ప్రభాతవార్త:

సార్వత్రిక ఎన్నికలు-2024 దృష్ట్యా బ్యాంకుల్లో 10 లక్షల రూపాయలకు పైబడి జరిగే ప్రతి లావాదేవి వివరాలను ఇవ్వాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సగిలి షన్మోహన్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశభవనంలో మంగళవారం కలెక్టర్ సగిలి షన్మోహన్ జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులుతో కలిసి బ్యాంకర్లతో సమావేశం అయ్యారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల నోటిఫికేషన్ ఏప్రిల్ 18న విడుదల కానుందని, ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు వారి పేరుపై లేదా వారి ఏజెంట్ల పేరుపై ఖాతాలను ప్రారంభించే విషయంలో బ్యాంకు అధికారులు సహకరించాలన్నారు. అభ్యర్థులకు సంబంధించి నగదు బదిలీ సమయంలో సంబంధిత ఎన్నికల అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్‌ను భారత ఎన్నికల సంఘం విడుదల చేసిందని, బ్యాంకుల్లో పది లక్షల రూపాయలకు పైబడి లావాదేవీలు చేసే ఖాతాల మీద దృష్టి పెట్టే క్రమంలో అలా లావాదేవీలు నిర్వహించే ఖాతాల వివరాలను కమిటీకి అందజేయాలన్నారు. జిల్లాలో 24 బ్యాంకుల పరిధిలో 264 బ్రాంచ్‌లు వున్నాయని, ఆర్థిక లావాదేవిల విషయంలలో సమాచారం అందించాల్సిన బాధ్యత బ్యాంకులపై వుందన్నారు.

## వైసిపిలో చేరిన వేనాటి రామచంద్రారెడ్డి

సూళ్ళూరుపేట, మార్చి 26, ప్రభాతవార్త



సూళ్ళూరుపేట నియోజకవర్గంలో 40 సంవత్సరాలుగా తెలుగుదేశం పార్టీతో ఉన్న అనుబంధాన్ని తెంచుకొని పార్టీ సీనియర్ నేత మాజీ టిటిడి బోర్డు సభ్యులు వేనాటి రామచంద్రారెడ్డి వైసిపి కండువా కప్పుకున్నారు. మంగళవారం తాడేపల్లిలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పార్టీ కండువా కప్పి వైసిపిలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా వైకాపా అధ్యక్షులు నేదురుమల్లి రాం కుమార్ రెడ్డి, సూళ్ళూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, ఎన్‌డిసిసిబి చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, చెంగాలమ్మ ట్రస్ట్ బోర్డు చైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## స్మార్ట్ సిటీ పనులపై సమీక్ష

### కమిషనర్ అధితి సింగ్

తిరుపతి కార్పొరేషన్, మార్చి 26, ప్రభాతవార్త



తిరుపతి స్మార్ట్ సిటీ కార్పొ రేషన్ ద్వారా చేపట్టిన పనులపై మంగళవారం స్మార్ట్ సిటీ అధికారులు, ఇంజనీరింగ్ అధికారులు, పనులు చేపట్టిన కాంట్రాక్టర్లతో తిరుపతి స్మార్ట్ సిటీ ఎండి, తిరుపతి మున్సి పల్ కార్పొరేషన్ కమిషనర్ అధితి సింగ్ సమీక్షించారు. ట్రిపుల్ సి పనులు చాలా నెమ్మదిగా నడుస్తున్నాయని, పనులు వేగవంతం చేయాలన్నారు. కచ్చపి ఆర్ట్ బ్లాక్ వద్ద ఏర్పాటు చేయబోవు కమాండ్ కంట్రోల్ సెంటర్ పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. వినాయక సాగర్‌లో పూర్తి చేయాల్సిన పనులపై సమీక్షిస్తూ పనులు వేగవంతం పై దృష్టి సారించాలని, వినాయకసాగర్ ముందర నిర్మించే షాపు నిర్మాణాలను పూర్తి చేయాలన్నారు. అదే విధంగా మల్టి లెవల్ కార్ పార్కింగ్ పనులు, ఇతర పనుల స్థితిగతులపై చర్చించి పనులు వేగవంతానికి కాంట్రాక్టర్లు పని చేయాలని, నిర్మాణాల పనులపై అధికారులు దృష్టి సారించాలని తిరుపతి స్మార్ట్ సిటి కార్పొరేషన్ ఎండి, తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అధితి సింగ్ తెలిపారు. ఈ సమావేశంలో సూపరింటెండెంట్ ఇంజనీర్ తిరుమాలిక మోహన్, మున్సిపల్ ఇంజనీర్ చంద్రశేఖర్, డిఈఈ విజయకుమార్ రెడ్డి, ఏయికాం సంస్థ ప్రతినిధి బాలాజీ, స్మార్ట్ సిటీ సిబ్బంది పాల్గొన్నారు.

## రామ్‌చరణ్ అభిమానుల సందడి

తిరుమల,మార్చి 26ప్రభాతవార్తప్రతినిధి:



య ు వ ని నీ న ట ు డ ు .మెగాస్టార్ చిరంజీవి కుమారుడు రామ్‌చరణ్ ,ఉపాసన దంపతులు మంగళవారం రాత్రి తిరుమలకు చేరుకున్నారు. వీరిని చూడటానికి అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. బసచేసిన అతిధిగృహం ప్రాంతంలో ప్రైవేటు భద్రత సిబ్బంది ఇబ్బందులు కలగకుండా చూశారు. నేడు రామ్‌చరణ్ జన్మదినం సందర్భంగా వేంకటేశ్వరస్వామిని దర్శించుకుని ఆశీస్సులందుకుంటారు.

## తాగునీటి సమస్యలను వెంటనే పరిష్కరించాలి

### కలెక్టర్ డా.జి. లక్ష్మీ షా

తిరుపతి కార్పొరేషన్, మార్చి 26, ప్రభాతవార్త



ఎండా కాలంలో తాగునీటి ఎద్దడి నివారణకు ప్రణాళికలు సిద్ధం చేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టాలని, కమాండ్ కంట్రోల్ రూంకు ఫిర్యాదు అందిన తాగునీటి సరఫరా స్కీమ్‌ల మరమ్మత్తు 48 గంటల్లో, హ్యాండ్ పంప్‌ల మరమ్మతులు 24 గంటల్లో పరిష్కరించాలని, ప్రతి 15 రోజులకు ఒకసారి త్రాగునీటి పై సమీక్ష నిర్వహించాలని, ఉపాధి హామీ పథకం పనుల్లో ఎస్సీ, ఎస్టీ కుటుంబాల కవరేజీ పెరిగేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డా.జి. లక్ష్మీ షా పేర్కొన్నారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి ఎండాకాలంలో త్రాగు నీటి ఎద్దడి నివారణకు ప్రణాళికలు, ఉపాధి హామీ పథకం కార్యక్రమం ద్వారా కూలీలకు ఉపాధి పనిదినాలు కల్పించడం వంటి పలు అంశాలపై కలెక్టర్ సమీక్షించి దిశా నిర్దేశం చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో త్రాగునీటి ఎద్దడి నివారణ కొరకు కంటింజెంట్ ప్రణాళికలు సిద్ధం చేయాలని, బోర్ల ఫ్లషింగ్, డీపెనింగ్ కొరకు 15వ ఆర్థిక సంఘం నిధులు వాడుకోవాలన్నారు. ఈ భూమి మీద ప్రతి ప్రాణి చాలా విలువైందన్నారు. పట్టణాలలో సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌లు పూర్తిగా నింపేలా, మల్టీ విలేజ్, హ్యాబిటేషన్ డిస్ట్రిబ్యూషన్ సిపిడబ్ల్యూ స్కీమ్స్‌ను నింపాలని, అలాగే జూన్ 31 వరకు చేపట్టాల్సిన యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని సూచించారు. మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం నందు కూలీలకు వంద రోజులు పనిదినాలు కల్పించాలన్నారు. సమావేశంలో జిల్లా త్రాగునీటి సరఫరా అధికారి విజయ్ కుమార్, పథక సంచాలకులు, డ్వామా శ్రీనివాస రావు, జిల్లా పంచాయితీ రాజ్, ఇంజనీరింగ్ అధికారి శంకర నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# వాహన మండపం ఎప్పటికి పూర్తయ్యేనో?

**శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఇంజనీరింగ్ విభాగం పనుల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. వారి నిర్లక్ష్యానికి నిదర్శనం రాజగోపురం,బిక్షాల గాలిగోపురం మధ్య ఏళ్ళ తరబడి సాగుతూనే ఉన్న 'దేవాంగుల మండపం' నిర్మాణం.రూ.కోటి అంచనాలతో నిర్మిస్తున్న దేవాంగుల మండపం నిర్మాణాన్ని అధికారులు స్థపతి ఆదేశాలంటూ కుడివైపు 30 అడుగులు మార్చారు. శివరాత్రికి ప్రారంభిస్తామని రెండు శివరాత్రులు గడిపారు ధర్మకర్తల మండలి చైర్మెన్.కానీ పూర్తి కాలేదు. మొదట ఈ మండపం నిర్మాణాన్ని తాము తీసుకుంటామని సంఘం పట్టుబట్టి పనులు తీసుకున్నారు.కానీ పునాదులు పూర్తి చేయలేక తమ వల్లకాదని చేతులెత్తేశారు.దాంతో రాతికట్టడాల్లో అనుభవం ఉన్న శ్రీధర్‌రెడ్డికి పనులు అప్పగించారు. ఆయన పనులు తీసుకొని రెండేళ్ళు గడిచినా శ్లాబ్ స్థాయికి వచ్చింది. ఏళ్ళు గడిచిపోతున్నాయి.కానీ నిర్మాణాలు మాత్రం పెరగలేదు.ఇంకెంతకాలం సాగుతుందో ఏమో?**

### ఏళ్ళుగా సాగుతూనే ఉన్న నిర్మాణం . . .




శ్రీకాళహస్తి,మార్చి 26 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి పట్టణ నిర్మాణం సందర్భంగా ఆ నాటి రాజులు నిర్ణయాత్మకంగా వ్యవహారించారు.ఇక్కడ వాహనాల మండపం ( దేవాంగుల మండపం) ఉండేది. అక్కడ స్వామి అమ్మవార్లను ఉత్సవాలకు తెచ్చినపుడు రాజగోపురం నుంచి మండపం వద్దకు తెచ్చి ప్రతిష్టించి అక్కడ నుంచి వాహనాల మండపంలో ఉంచి వాహనాలపై అధిష్టించి గ్రామోత్సవానికి పంపటం ఆనవాయితి. ఇందుకు నాడు పరిపాలించిన రాజులు వాహనాల మండపాన్ని దానికి పక్కనే విడిది గృహం, నిర్వహణకు ఆర్థికంగా నిలదొక్కుకోవటానికి ఏర్పాట్లు చేసారు. దానిని దేవాంగుల సంఘం నిర్వాహకులు సత్రం ఎదురుగా దుకాణాలు ఏర్పాటు చేసుకొని నిర్వహించే వారు.

#### గోపుర నిర్మాణానికి తొలగింపు తరువాత నిర్లక్ష్యం:

శ్రీకాళహస్తిలో శ్రీకృష్ణదేవరాయలు విజయ యాత్రలో భాగంగా ఇక్కడ సుమారు140అడుగుల ఎత్తు గల రాజగోపురాన్ని నిర్మించారు. ఇది సుమారు 400 సంవత్సరాల పాటు మనుగడ సాధించింది. తరువాత శిధిలావస్థకు చేరుకుంది. 1988 తరువాత రోజు రోజుకు గోపురం మనుగడ ప్రశ్నార్థకంగా మారింది.2010లో రాజగోపురం కుప్పకూలింది. ఈ గోపురం పునర్నిర్మాణానికి అప్పటి ముఖ్యమంత్రి రోశయ్య నవయుగ కన్‌స్ట్రక్షన్స్‌కు అప్పగించారు.వారు 2017 నాటికి పూర్తి చేసి మహాకుంభాభిషేకం నిర్వహించారు. గోపురనిర్మాణానికి దేవాంగుల మండపం అడ్డంగా ఉందని తొలగించారు. తరువాత అదేస్థాయిలో మండపం నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించారు.2017లో అప్పటి ధర్మకర్తల మండలి,స్థానిక నాయకుడు బొజ్జల గోపాలకృష్ణారెడ్డి కొత్త మండపం నిర్మాణానికి భారీ ఎత్తున శంకుస్థాపన చేసారు. అయితే వారిప్రయత్నం ఫలించలేదు.శిలాఫలకానికే పరిమితం అయ్యారు. వారు రెండేళ్ళు పరిపాలించినా దేవాంగుల మండపం నిర్మాణానికి రాయిపడలేదు. పనులు మాత్రం మరో శివరాత్రి గడచిపోయింది.కానీ స్వామి అమ్మవార్లను పందిళ్ళలోనే గడిపారు.ఇక మండపం నిర్మాణానికి గతంలో వాస్తుప్రకారం నిర్మాణాలు జరిపితే ప్రస్తుతం ఈ నిర్మాణానికి 30 అడుగులు దక్షిణం వైపుకు జరిపారు.ఇక్కడ ఉన్న గాంధీ విగ్రహాన్ని తొలగించారు.కానీ నిర్మాణం మాత్రం పూర్తికాలేదు.

#### అధికారుల మాటలు నీటి మూటలు:

శ్రీకాళహస్తీశ్వరాలయం సారధ్యంలో నిర్వహిస్తున్న వాహనాల మండపం నిర్మాణానికి సంబంధించి అధికారుల మాటలు నీటి మూటలుగా మారాయి. ఇదిగో ఇదిగో అంటూ కాలయాపన చేయటం మినహా పూర్తి కావటం లేదు. శివరాత్రి పూర్తి చేయాలన్న నిర్ణయం నీటి మీద రాతగా మారింది. శివరాత్రి ముగిసింది. అభివృద్ది మూల పడింది. శివరాత్రికి పనులు ఆఘమేఘాల మీద చేయటం బిల్లులు చేసుకోవటం తప్ప జవాబుదారి తనం కనబడటం లేదు.

## సీ-విజిల్‌లో ఫిర్యాదుపై కమిషనర్ విచారణ

**చిత్తూరు, మార్చి 26 ప్రభాతవార్త:**
ఎన్నికల నిర్వహణలో భాగంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళికి సంబంధించి సీ-విజిల్ యాప్‌లో అందిన ఫిర్యాదుపై మంగళవారం ఎఆర్‌ఓ, మున్సిపల్ కమీషనర్ డాక్టర్ జె.అరుణ క్షేత్ర స్థాయికి వెళ్ళి విచారణ నిర్వహించారు. ఎస్‌బిఐ కాలనీలోని మొదటి వీధిలో తెలుగుదేశం పార్టీ నాయకులు డి.ప్రసాద్‌రావు కార్యాలయం వద్ద అనుమతులు లేకుండా హోర్డింగ్స్ పెట్టారని సీ-విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు అందింది. ఈ ఫిర్యాదుపై కమీషనర్ డాక్టర్ జె.అరుణ ఎంసిసి, ఎఫ్‌ఎస్టీ అధికారులతో కలిసి విచారణకు వెళ్ళి తనిఖీలు చేశారు. కార్యాలయం వద్ద హోర్డింగ్స్, వాహనాలు, సౌండ్ సిస్టంకు సిబంధించిన అనుమతులను పరిశీలించారు. అన్నింటికీ సరైన అనుమతులు తీసుకొన్నట్లు గుర్తించి రిటర్నింగ్ అధికారికి అందజేశారు. సీ-విజిల్ యాప్ ద్వారా ఇప్పటి వరకు 19 ఫిర్యాదులు అందాయని ఎఆర్‌ఓ జె.అరుణ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంసిసి, ఎఫ్‌ఎస్టీ అధికారులు రామకృష్ణుడు, గోపి, గోపాలకృష్ణవర్మ, పోలీసులు పాల్గొన్నారు.

## స్పందన హాలులో మౌళిక వసతుల ఏర్పాట్లు సత్వరం పూర్తి

*- కలెక్టర్ సగిలి షన్మోహన్*

**చిత్తూరు, మార్చి 26 ప్రభాతవార్త:**
కలెక్టరేట్ ఆవరణలో నూతనంగా నిర్మించిన స్పందన హాలులో అవసరమైన మౌళిక సౌకర్యాలను సత్వరం చేపట్టి పూర్తి చేయాలని కలెక్టర్ సగిలి షన్మోహన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ ఆవరణలో నూతనంగా నిర్మించిన స్పందన హాలును మంగళవారం కలెక్టర్ సగిలి షన్మోహన్ జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులతో త్వరితంగా స్పందన హాలులో మౌళిక సౌకర్యాలు పూర్తి చేసి అప్పగించడానికి చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌ఓ బి.పుల్లయ్య, పంచాయతీరాజ్ ఎస్ఇ చంద్రశేఖర్‌రెడ్డి, సంబంధిత ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఎస్‌ఆర్‌ఆర్ కండ్రిగ సర్పంచ్ జయలక్ష్మి మృతి

**పాలసముద్రం, మార్చి 26 ప్రభాతవార్త:**
పాలసముద్రం మండలం ఎస్‌ఆర్‌ఆర్ కండ్రిగ పంచాయతీ సర్పంచ్ కొండూరు జయలక్ష్మి(73) మంగళవారం మృతి చెందారు. రాష్ట్ర తెలుగుదేశం కార్యనిర్వాహక కార్యదర్శి భీమినేని చిట్టిబాబు, ఇతర దేశం నాయకులు ఆమె భౌతిక దేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా భీమినేని చిట్టిబాబు మృతి చెందిన సర్పంచ్ కుమారుడు తిరుపతి ఎస్వీ డిజిటల్ అధినేత కొండూరు మోహన్‌రాజును పరామర్శించి ధైర్యం చెప్పారు. జయలక్ష్మీ పార్థీవ దేహంకు నివాళులు అర్పించిన వారిలో మండల తెలుగుదేశం ప్రధాన కార్యదర్శి శేఖర్‌రాజు, జిల్లా దేశం కార్యదర్శి వాసునాయుడు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు సాంబశివన్, నాయకులు తంగరాజు, నాగరాజు, రంజిత్‌కుమార్, బాబుయాదవ్, ఉమాపతి, శ్రీరాములనాయుడు, కృష్ణమనాయుడు, నవీన్‌చౌదరి తదితరులు వున్నారు.

## కుప్పం అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

*- చిత్తూరు ఎం.పి. రెడ్డెప్ప*



**కుప్పంరూరల్, మార్చి 26 ప్రభాతవార్త**
కుప్పం అభివృద్ధికి తాము కట్టుబడి ఉన్నామని చిత్తూరు ఎంపి రెడ్డెప్ప, ఎమ్మెల్సీ భరత్, మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్ పేర్కొన్నారు. మంగళవారం కుప్పం పట్టణంలోని 20వ వార్డు లో వారు గడగపడపకు కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఐదేళ్ల కాలంలో కుప్పంలో సంక్షేమ పథకాల ద్వారా రూ.1400కోట్లు నేరుగా ప్రజల ఖాతాల్లోకే జమ చేశామన్నారు. కుప్పం మున్సిపాలిటీలో రూ.66 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. అర్హులైన ప్రతిఇక్కరికీ నవరత్నాలు పథకాల్లో లబ్ధి కలిగించామన్నారు. మాట తప్పని వ్యక్తి సిఎం జగన్ అని జగన్‌ను మరోమారు సిఎంగా చేయాలని కోరారు. కుప్పం ఎమ్మెల్యేగా భరత్‌ను, ఎంపిగా తనను గెలిపించాలని ఎంపి రెడ్డెప్ప కోరారు. కార్యక్రమాల్లో క్లస్టర్ ఇన్‌చార్జ్ నాను, బిల్డింగ్ సొసైటీ ఛైర్మన్ అబ్బాస్, కౌన్సిలర్ జగన్, నేతలు అవినాష్, సి వెంకటపతి తదితరులు పాల్గొన్నారు.

## ఆస్తి పన్నుపై వడ్డీ మాఫీకి ఐదు రోజులే గడువు

**చిత్తూరు, మార్చి 26 ప్రభాతవార్త:**
2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆస్తి, ఖాళీ స్థలాల పన్నుపై వడ్డీ మాఫీ గడువు ఇక ఐదు రోజులే మిగిలి వుందని, ఈ అవకాశంను పన్ను చెల్లింపుదారులు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమీషనర్ డాక్టర్ జె.అరుణ కోరారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆస్తి, ఖాళీ స్థలాల పన్ను బకాయిల మొత్తంను ఒకేసారి చెల్లించిన వారికి వడ్డీ మాఫీ వుంటుందన్నారు. బకాయిల మొత్తంను మార్చి 31వ తేదీలోపు చెల్లించాల్సి వుంటుందన్నారు. సెలవు రోజుల్లో సైతం మున్సిపల్ కార్యాలయం ఆవరణలోని పురసేవ కేంద్రం పని చేస్తోందని, వార్డు సచివాలయాల్లోను పన్ను చెల్లించవచ్చునని ఆమె పేర్కొన్నారు.

## సొంతగూటికి చేరుకున్న మాదిరాజు



**చౌడేపల్లి, మార్చి 26 ప్రభాతవార్త**
రాజకీయాల్లో శాశ్వత శత్రువులు మిత్రులుండరన్న నానుడిని నిజం చేస్తూ మాదిరాజు వెంకట్రమణరాజు సొంత గూటికి చేరుకొన్నారు. తొలి నుంచి సంచలన వ్యక్తిగా పేరుగాంచిన మాదిరాజు వెంకట్రమణరాజు తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు కుప్పం పర్యటనలో వుండగా అయన సమక్షంలో పసుపు కండువా కప్పుకొన్నారు. దివంగత ముఖ్యమంత్రి ఎన్టీఆర్ పాలనలో ఏర్పాటైన మండల వ్యవస్థ ఏర్పడ్డాక 1987లో మాదిరాజు వెంకట్రమణరాజు ఎంపిపిగా సేవలందించారు. మాజీ ఎంపి దివంగత నూతనకాల్వ రామకృష్ణారెడ్డి వద్ద మాదిరాజు వెంకట్రమణరాజు రాజకీయ ఓనమాలు దిద్దుకొన్నారు. అప్పటి నుంచి ఎంపిపిగా జడ్పీటీసీగా ఆయనతోపాటు రాజు సతీమణి ఎం.చంద్రవదనలు ప్రజలకు సుపరిచితులే. అప్పట్లో తేదేపా అధిష్టానం 2009, 2014ఎన్నికల్లో రాజును పుంగనూరు నియోజకవర్గ అభ్యర్థిగా పోటీ చేసే అవకాశమిచ్చారు. ప్రస్తుత మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చేతిలో రెండు పర్యాయాలు ఓటమి పాలయ్యారు. 2019లో మాజీ మంత్రి నూతనకాల్వ అమరనాథరెడ్డి తమ్ముడి భార్య నూతనకాల్వ అనీషారెడ్డికి టిడిపి టిక్కెట్టు ఇవ్వడంతో అప్పటి నుంచి స్తబ్ధతగా వున్న రాజు తర్వాత మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో వైకాపాలోకి చేరారు. అయితే కొద్ది రోజులుగా దూరంగా వుంటూ వచ్చిన మాదిరాజు వెంకట్రమణరాజు, మాదిరాజు ప్రదీప్‌రాజులు ఈనెల 25న పుంగనూరు టిడిపి అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డి(బాబు), పతిరాజు, మండల టిడిపి అధ్యక్షుడు గువ్వల రమేష్‌రెడ్డిల ఆధ్వర్యంలో కుప్పంలో నారా చంద్రబాబునాయుడు సమక్షంలో టిడిపిలో చేరారు.

## చల్లాబాబుకు పట్టణంలో ఘనస్వాగతం

**పుంగనూరు, మార్చి 26 ప్రభాతవార్త :**



పట్టణంలో తెలుగుదేశంపార్టీ అభ్యర్థిగా పర్యటిస్తున్న చల్లా బాబుకు మంగళవారం ఘనస్వాగతం లభించింది. పార్టీ సీనియర్ నాయకుడు, సామాజికవేత్త సయ్యద్ సుహేల్ సారధ్యంలో ఆయనకు ఎంబిట రోడ్డులో పార్టీశ్రేణులు ఘనంగా స్వాగతం పలికారు. సుబేదారువీధి, నానబాల వీధి, బెస్తవీధి, చర్చివీధులలో ఆయన ఇంటింటికి పర్యటించారు. ఈసందర్భంగా సయ్యద్‌సుహేల్ మాట్లాడుతూ పదేళ్ళపాటూ నరకాన్ని అనుభవించిన పుంగనూరు ప్రజలు ఇపుడు పెద్దిరెడ్డిని ఓడించేందుకు సిద్దంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో తెలుగేదశం, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బోడె రామచంద్రయాదవ్‌పై కోడ్ ఉల్లంఘన కేసు నమోదు

**చౌడేపల్లి, మార్చి 26 ప్రభాతవార్త**
భారత చైతన్య యువజన పార్టీ(బిసివై)పార్టీ అధినేత బోడె రామచంద్రయాదవ్‌పై ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘన కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ప్రతాపరెడ్డి తెలిపారు. ఆయన కథనం మేరకు...బిసివైపార్టీ అధినేత బోడె రామచంద్రయాదవ్ మంగళవారం ఎన్నికల ప్రచారం నిమిత్తం పుంగనూరు ఎన్నికల అధికారి మధుసూదన్‌రెడ్డి నుంచి ఉత్తర్వులు తీసుకొన్నారు. చౌడేపల్లి బస్టాండు వద్ద చారాలకు వెళ్ళే మార్గంలో సభ జరుపుకొనుటకు మాత్రమే అనుమతి పొందివున్నారు. అయితే ఆర్‌ఓ అనుమతి ఇచ్చిన విధంగా కాకుండా బస్టాండు కూడలిలో సభ నిర్వహించడమే కాకుండా రోడ్డు మీద బాణా సంచాలుపేల్చి,ట్రాఫిక్‌అంతరాయంకల్గించిఎన్నికలనియమావళినిఉల్లంఘించినందున రామ చంద్రయాదవ్, అతనిఅనుచరులునారాయణస్వామి, హరినాథ్‌రెడ్డిలపైక్రిమినల్ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వివరించారు

## పకడ్బందీగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి

*- కమీషనర్ డాక్టర్ జె.అరుణ*

**చిత్తూరు, మార్చి 26 ప్రభాతవార్త:**
చిత్తూరు నగర పాలక సంస్థ పరిధిలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పకడ్బందీగా అమలు చేయాలని ఏఆర్‌ఓ, మున్సిపల్ కమీషనర్ డాక్టర్ జె.అరుణ ఎన్నికల బృందాలను ఆదేశించారు. మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో మంగళవారం మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలుపై ఎంసిఇ, ఎఫ్‌ఎస్టీ, వీఎస్టీ, లా అండ్ అర్డర్, స్వీప్ బృందాలతో కమీషనర్ సమీక్షించారు. ఈ సమావేశంలో కమీషనర్ మాట్లాడుతూ నగర పరిధిలో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలు తీరుపై నిరంతరం నిఘా వుంచాలన్నారు. రాజకీయ పార్టీలు ఏర్పాటు చేసిన బ్యానర్లు, జెండాలు, పోస్టర్లను ఎప్పటికప్పుడు తొలగించాలని ఆదేశించారు. ఎన్నికలకు సంబంధించి ఏ కార్యక్రమం అయినా రిటర్నింగ్ అధికారి నుండి అనుమతులు తీసుకోవాలని, రాజకీయ పార్టీల కార్యక్రమాలకు సంబంధించి అనుమతులను తనిఖీ చేయాలన్నారు. అన్ని ఎన్నికల బృందాలు రోజువారి నివేదికలను సకాలంలో, సక్రమంగా సమర్పించాలన్నారు. స్వీప్ కార్యక్రమాలను మరింత విస్తృతం చేయాలని, 18సంవత్సరాలు పూర్తయిన వారు ఓటరుగా నమోదు, ఓటు హక్కు సద్వినియోగంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎసిపి రామకృష్ణుడు, సిఎంఎం గోపి, ఆర్‌ఓ గోపాలకృష్ణవర్మ, మేనేజర్ ఉమామహేశ్వర్‌రెడ్డి, స్వీప్ నోడల్ ఆఫీసర్ చిన్నయ్య, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## ఎన్నికల నిర్వహణకు పక్కా ఏర్పాట్లు

*- జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు*

**గుడిపాల, మార్చి 26 ప్రభాతవార్త:** సార్వత్రిక ఎన్నికలు-2024 నిర్వహణ ఏర్పాట్లను పక్కాగా చేపట్టి పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్, చిత్తూరు నియోజకవర్గ ఆర్‌ఓ పి.శ్రీనివాసులు అధికారులను ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు మంగళవారం మండలంలోని పలు పోలింగ్ స్టేషన్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ మండల పరిధిలో 45 పోలింగ్ కేంద్రాలు వున్నాయని ఈ కేంద్రాల్లో ఓటర్లకు అన్ని మౌళిక సౌకర్యాలు కల్పించడానికి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల్లో వీల్ ఛైర్లు, మంచినీరు, లైటింగ్, ఫర్నిచర్ తదితర సౌకర్యాలు కల్పించాలని తహసిల్దారు విజయలక్ష్మిని ఆదేశించారు. అలాగే మండి కృష్ణాపురం, మరకాలకుప్పం, బొమ్మసముద్రం, నంగమంగళం, తిమ్మయ్యపల్లి గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. అలాగే తమిళనాడు-ఆంధ్ర రాష్ట్రం సరిహద్దులో మరకాలకుప్పం వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును ఆయన తనిఖీ చేసి పోలీసులు అప్రమత్తంగా విధులు నిర్వర్తించి అక్రమ రవాణకు అడ్డుకట్టు వేయాలని ఆదేశించారు. ఇటువైపు వచ్చిన ప్రతి వాహనంను తనిఖీ చేసి వీడియో తీయాలన్నారు. బిల్లులు, ఆధారాలు లేని నగదు, బంగారం, వెండి తదితరాలను సీజ్ చేయాలని ఆదేశించారు. సీజ్ చేసిన నగదుకు సంబంధించి వాహనదారులకు తగిన రసీదులు ఇవ్వాలన్నారు. అక్రమ మద్యం రాష్ట్రంలోకి రాకుండా కట్టడి చేయాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో తహసిల్దారు విజయలక్ష్మీ, ఎంపిడిఓ రాజశేఖర్‌రెడ్డి, ఆర్ఐ రమసాయి. సెక్టోరియల్ అధికారులు, రూట్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

## కాణిపాకం ఆలయ అభివృద్ధికి రూ.లక్ష విరాళం



**కాణిపాకం, మార్చి 26 ప్రభాతవార్త:**
కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానంలో అమలవుతున్న అభివృద్ధి పనులకు ఓ భక్తుడు మంగళవారం లక్ష రూపాయలను విరాళంగా అందజేశారు. ఈమేరకు హైదరాబాద్‌కు చెందిన కీర్తి విహిన్ విరాట్ అనే భక్తుడు ఆలయ అభివృద్ధికి 1,16,000 రూపాయలను విరాళంగా అందించారు. ఈమొత్తాన్ని దాత కుటుంబసభ్యులతో కలసి ఆలయ ఇన్స్‌పెక్టర్ విఘ్నేష్‌కు అందజేశారు.దాతలకు ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి దర్శనంకల్పించి తీర్థ, ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో దాత కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

## జిడినెల్లూరు వైకాపా నాయకులతో బుల్లెట్ సురేష్ భేటీ

**చిత్తూరురూరల్, మార్చి 26 ప్రభాతవార్త:**



జిడినెల్లూరు నియోజకవర్గంలోని వైకాపా ముఖ్యనా యకులతో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపి మిధున్‌రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ ఛైర్మెన్ బుల్లెట్ సురేష్ పార్టీ కార్యా లయంలో మంగళవారం భేటీ అయ్యారు. ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి ప్రభుత్వం స్థాపించిన నాటినుంచి ఇప్పటివరకు ఎన్నో పథకాలను పేదవారి కోసం తెచ్చి వారి జీవితంలో వెలుగుల్ని నింపాడని, కుల మత భేదాలు చూడకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలను అందించి వారి వెంట నిలిచాడన్నారు. ఎన్నికల సమయంలో వచ్చి కల్లిబొల్లి మాటలు చెప్పే ప్రతిపక్ష నాయకులను నమ్మవద్దని రాబోవు ఎన్నికల్లో వైసిపి నాయకులు, కార్యకర్తలు పార్టీ గెలుపుకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు, కార్యకర్తలుపాల్గొన్నారు.

## పోలీసులను ఆశ్రయించిన ప్రేమజంట

**చౌడేపల్లి, మార్చి 26 ప్రభాతవార్త**



కుటుంబ సభ్యులు, బంధువుల నుంచి రక్షణ కల్పించాలని కోరుతూ ప్రేమజంట పోలీసులను ఆశ్రయించింది. వారి కథనం మేరకు...మండలంలోని చారాల పంచాయతీ ఓదులపేటకు సి.కీర్తి అదే గ్రామానికి చెందిన వరసకు మామ అయిన ఎ.రాజశేఖర్‌రెడ్డిలు 6నెలలుగా ప్రేమించుకొంటున్నారు. ఇంట్లో తెలిస్తే తమ పెళ్ళికి అంగీకరించరన్న ఉద్దేశ్యంతో మేజర్లమైనందున ఈనెల 20న పారిపోయి వివాహం చేసుకొన్నట్లు కీర్తి తెలిపింది. అయితే తన ఇంటివారి నుంచి తనకు, భర్త రాజశేఖర్‌రెడ్డికి ప్రాణహాని వుందనీ, రక్షణ కల్పించాలని పోలీసులను ఆశ్రయించింది.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## ఎమ్మెల్యే ఆనం చేతిలో ధనంజయ రెడ్డి కీలుబొమ్మ



వైసీపీ జిల్లా కార్యదర్శి చిట్టేటి హరికృష్ణ

**వెంకటగిరి టౌన్, మార్చి 26, ప్రభాతవార్త**
ఎమ్మెల్యే రామనారాయణరెడ్డి చేతిలో మాజీ సెంట్రల్ బ్యాంక్ ఛైర్మన్ ధనుంజయ రెడ్డి కలిమిలి రాంప్రసాద్ రెడ్డిలు కీలుబొమ్మలా వ్యవహరిస్తున్నారని వైసిపి తిరుపతి జిల్లా కార్యదర్శి చిట్టేటి హరికృష్ణ తెలిపారు. వెంకటగిరిలోని ఎన్‌జేఆర్ భవనంలో వైసిపి నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే ఆనం రామనారాయణ రెడ్డి చేతిలో ధనుంజయ రెడ్డి కీలుబొమ్మలాగా ఉన్నారని విమర్శించారు. నియోజకవర్గాన్ని రాంకుమార్ రెడ్డి ఎంతగానో అభివృద్ధి చేశారని తెలిపారు. రావూర్ మండల వైసిపి అధ్యక్షులు దందవోలు నారాయణ రెడ్డి మాట్లాడుతూ ధనంజయ రెడ్డి చుట్టూ తెలుగుదేశం పార్టీకి చెందిన వారు ఉన్నారని తెలిపారు. నారా భవనేశ్వరి పర్యటించినప్పుడు ఆమెతో పాటు ధనుంజయ రెడ్డి అనుచరులు పర్యటనలో పాల్గొన్నట్లు ఫోటోలు చూపించారు. భారీ మెజార్టీతో రాంకుమార్ రెడ్డి విజయం సాధిస్తారని తెలిపారు. వెంకటగిరి టౌన్ క్లబ్ అధ్యక్షులు లక్కమనేని కోటేశ్వర రావు మాట్లాడుతూ రామ్ కుమార్ రెడ్డి నియోజకవర్గంలో కోట్లాది రూపాయిలు అభివృద్ధి పనులు చేసినట్లు తెలిపారు. వెంకటగిరిలో రామ్ కుమార్ రెడ్డి పోలేరమ్మ జాతరను రాష్ట్ర స్థాయి పండుగ చేసినట్లు తెలిపారు. నేదురుమల్లి కుటుంబాన్ని విమర్శించే స్థాయి వారికి లేదన్నారు. ఈ సమావేశంలో మాజీ ఏఎంసి ఛైర్మన్ మధుసూధన్ రెడ్డి, దక్కిలి జేసిఎస్ కన్వీనర్ చింతల శ్రీనివాసరెడ్డి, వెంకటగిరి టౌన్ కన్వీనర్ ఢిల్లీ బాబు, మున్సిపల్ వైస్ ఛైర్మన్ బాలయ్య, జయంపు సొసైటీ అధ్యక్షులు కార్తీక్ రెడ్డి, వైసిపి నాయకులు శంకర్ రెడ్డి, కె. శ్రీనివాసులు రెడ్డి, సతీష్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## ఆశీర్వదించండి అభివృద్ధి చేపడుతా ...విజయశ్రీ

**దొరవారిసత్రం మార్చి 26 ప్రభాతవార్త ;**
త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు తమను ఆశీర్వదించి గెలిపిస్తే అభివృద్ధి చేపడుతానని సూళ్ళూరుపేట తెలుగుదేశంపార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి నెలవల విజయశ్రీ అన్నారు.మంగళవారం ఆమె దొరవారిసత్రం మండలం నెలబల్లి గ్రామంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నెలవల విజయశ్రీ మాట్లడుతూ రాష్ట్రం అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమౌతుందన్నారు.వైకాపా హయాంలో ఇసుక,గ్రావెల్,మట్టి మాఫియా తప్ప అభివృద్ధి జరగలేదన్నారు.తమకు అవకాశం కల్పించి ఆశీర్వదిస్తే సూళ్ళూరుపేట నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని ఆమె తెలియజేశారుఆమెవెంట మాజీఎమ్మెల్యే నెలవల సుబ్రమణ్యం,మాజీ ఎంపిపి ఇట్ట గుంట రత్నయ్య, మండలపార్టీ అధ్యక్షుడు వేమసాని శ్రీనివాసులునాయుడు,ఎస్సీసెల్ అధ్యక్షుడు గోను జకరయ్య, మాజీఎంపిటిసిబందిలఉదయ్‌కుమార్,నాయకులుచింతకానికిషోర్‌నాయు డు,వల్లిపి వెంకట య్య,ఉన్నారు.

## నేదురుమల్లి కుటుంబం ప్రజలకు అండగా ఉంటుంది

*మాజీ మంత్రి రాజ్యలక్ష్మి*



**వెంకటగిరి టౌన్, మార్చి 26, ప్రభాతవార్త**
నేదురుమల్లి కుటుంబం ప్రజలకు ఎప్పుడూ అండగా ఉంటుందని మాజీ మంత్రి నేదురుమల్లి రాజ్యలక్ష్మి తెలిపారు. నీలకంఠాపురం, కె. ఉప్పలపల్లి, చిన్న పరెడ్డి పల్లి గ్రామాల్లో ఆమె పర్యటించి గ్రామస్తులను కలుసుకున్నారు. 1978 నుండి నియోజకవర్గ ప్రజలను నమ్ముకొని ఉన్నామని తెలిపారు. అన్ని గ్రామాలకు రోడ్లు తాగునీటి వసతి కల్పించినట్లు తెలిపారు. ప్రజా సేవే నేదురుమల్లి కుటుంబం అంకితమవుతుందని తెలిపారు. తమ బిడ్డ రాంకుమార్ రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. పాత స్నేహితులతో ఆమె ఆప్యాయంగా పలకరించి మాట్లాడారు. అందరి ఇళ్లకు వెళ్లి వారితో ముచ్చటించారు. ఆమె వెంట సొసైటీ అధ్యక్షులు నాగయ్య తదితరులు ఉన్నారు.

## ఎన్నికల్లో ప్రతి ఒక్కరు సైనికులు లాగా పనిచేయాలి

*టిడిపి అభ్యర్థిని కురుగొండ్ల లక్ష్మీసాయి ప్రియ*

***వెంకటగిరి టౌన్, మార్చి 26, ప్రభాతవార్త***
మే నెలలో జరగబోయే ఎన్నికల్లో ప్రతి ఒక్కరు సైనికులు లాగా పనిచేయాలని తెలుగుదేశం పార్టీ అభ్యర్థిని కురుగొండ్ల లక్ష్మీ సాయి ప్రియ తెలిపారు. వెంకటగిరిలోనే ఆమె నివాస గృహంలో వార్డు ఇన్చార్జిలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. మాజీ సిఎం చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీలను ప్రజలకు తీసుకెళ్లాలని తెలిపారు. ఇంకా పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. సమావేశంలో మాజీ ఏఎంసి ఛైర్మన్ రాజేశ్వర రావు, నాయకులు సత్యనారాయణ, గంగాధర్, విశ్వనాథం, ఆనంద్ పాల్గొన్నారు.

## స్వతంత్ర అభ్యర్థిగా పోటీకి సిద్ధమవుతున్న ధనంజయ రెడ్డి

**వెంకటగిరి టౌన్, మార్చి 26, ప్రభాతవార్త**



వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ టికెట్ ఆశించి దక్కపోవ దంతో మాజీ సెంట్రల్ బ్యాంక్ ఛైర్మన్ మెట్టుకూరు ధనంజయరెడ్డి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నారు. సెల్ఫోన్ ద్వారా ఆయన సర్వే కూడా చేయించుకుంటున్నారు. వెంకటగిరి పట్టణంలో సోమవారం సేవ్ వెంకటగిరి పేరుతో భారీ ర్యాలీ సమావేశాన్ని నిర్వహించారు. అభ్యర్థి రాంకుమార్ రెడ్డిని మార్చాలని ఆయన సమావేశంలో డిమాండ్ చేశారు. అందరూ ఆశీర్వదిస్తే పోటీకి దిగుతానని తెలిపారు. స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసేందుకు ఆయన అన్ని ఏర్పాట్లు చేసుకుంటున్నారు. సెంట్రల్ బ్యాంక్ ఛైర్మన్‌గా ఉన్నప్పుడు ఆయనకు నియోజకవర్గంలో పరిచయాలు పెంచుకున్నారు. దివంగత మాజీ ఎంపిపి చెన్న బాలకృష్ణారెడ్డి, స్వయానా బావ కావడంతో ఆయన రాపూర్ మండలంలో పట్టు పెంచుకున్నారు. నియోజకవర్గ పరిశీలకులు కూడా ఆయన పనిచేశారు. వైసిపిలో పలువురు నాయకులు నచ్చ చెప్పిన ఆయన పోటీ చేయాల్సిందేనని మొండిపట్టు పట్టారు. నియోజకవర్గంలోని పలువురు నాయకులతో ఆయన ఇప్పటికే మంతనాలు సాగించారు.

## అర్చకులపై జరిగే దాడుల్ని అరికట్టాలి

**కోట, మార్చి 26 ప్రభాతవార్త**
కాకినాడ శివాలయంలో పనిచేసే అర్చకులు సాయి, శర్మ, విజయ్‌కుమార్ శర్మపై పాల్గుణ పౌర్ణమి నాడు గర్భగుడి వద్ద జరిగిన భౌతిక దాడులను తిరుపతి జిల్లా తెలుగు దేశం పార్టీ కార్యదర్శి తూపిలి రాధకృష్ణా రెడ్డి తీవ్రంగా ఖండించారు. ఆమేరకు ఆయన కోటలో మంగళవారం విలేకర్లతో మట్లాడారు. అర్చకులపై డాడి చేసిన కార్పరేట్ చంద్రశేఖర్‌పై కేసు నమోదు చేసి తోణమే అరెస్టు చేయాలన్నారు. కాకినాడ జిల్లా ఎండోమెంట్ ఆఫసర్ పై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండు చేశారు. జగన్ పాలనలో అర్చ కులపై దాడులు నిత్యకృత్యమయ్యాయని పిర్యాదు చేసినా చరనయలు తీసుకున్న దాఖలాల్లేవని ఆరోపించారు. వైకాపా అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో 200పైగా ఆలయాలపై దాడులు జరిగాయని చెప్పారు. అర్చకులపై దాడి బెదిరింపులు రాక్షసత్వమే అవుతుందన్నారు. బ్రాహ్మణుల జీవితాలతో సీఎం జగన్ చెలగాటమాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు,

## నిష్పక్షపాతంగా ఎన్నికల నిర్వహణ

**కోట, మార్చి 26 ప్రభాతవార్త**



మే 13 న జరగనున్న లోక్ సభ, శాసన సభ ఎన్నికలను నిష్పక్షపాతంగా నిర్వహిం చడానికి చర్యలు తీసుకుంటున్నట్లు కోట మండల తహిశీల్దార్ నాగరాజరావు చెప్పా రు. మంగళవారం స్థానిక మండల పరి షత్ కార్యాలయాంలో అర్చకులు, ఇమాములు, పాస్టర్లుతో ఆయన సమావేశాన్ని నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రార్ధన మంది రాల్లో సభలు, సమావేశాలు ప్రచారాలు నిషేదమన్నారు. మండలంలోని దేవాలయాలు, మసీదులు, చర్చిలల్లో ప్రచారాలు చేయరాదన్నారు. ఆలయాల్లో ప్రచారాలు నిర్వహిస్తే చట్టపరంగా చర్యలు తీసు కొవడం జరుగుతుందన్నారు. బ్యానర్లు, గోడ రాతల, కరపత్రాలు పంఁజణీ వంటివి చేపట్టరాదన్నారు.

## వైసిపి నాయకులను విస్మరించడం సరైన పద్ధతి కాదు



**నాయుడుపేట టౌన్ మార్చి 26 ప్రభాతవార్త**
నాయుడుపేట పట్టణంలో ఇటీవల వైసిపిని వీడి తెలుగుదేశంపార్టీలో చేరిన 786రపి నీ పద్ధతి మార్చుకోకపోతే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని మున్సిపాల్టి వైస్ ఛైర్మన్ వెంకటకృష్ణరెడ్డి హెచ్చరించారు. మంగళవారం నాయుడుపేట ఎమ్మెల్యే కార్యాలయంలో ఆయన ఆధ్వర్యంలో వైసిపి నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపాల్టి వైస్ ఛైర్మన్ వెంకటకృష్ణారెడ్డి మాట్లాడుతూ పార్టీలు మారినంతలో వైసిపి నాయకులను విస్మరించడం సరైన పద్ధతి కాదన్నారు. ఇలాంటి పద్ధతులు మానుకోవాలని ఆయన సూచించారు. ఆయన వెంట లాయర్ చదలవాడ కుమార్, కటకం జయరామయ్య, కౌన్సిలర్ నాగార్జున, రాజేష్, రత్నశ్రీ, తదితరులు ఉన్నారు.

## యువత భవితను చిదిమేస్తున్న జగన్ డ్రగ్స్ మాఫియా..

**గూడూరు, మార్చి 26, ప్రభాతవార్త**

తెలుగు మహిళలు ఆరోపణ



యువత భవితను జగన్ ప్రభుత్వం చిదిమేస్తుందని తెలుగుమహిళలు ఆరోపించారు. మంగళవారం మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ సూచనల మేరకు గూడూరు పట్టణంలోని పార్టీ కార్యాలయంలో తెలుగు మహిళలు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టిడిపి హయాంలో పెట్టుబడుల ఆకర్షణలో మొదటి స్థానంలో ఉన్న ఏపిని జగన్ రెడ్డి గంజాయి, డ్రగ్ రవాణాలో మొదటి స్థానానికి చేర్చారని, విశాఖను స్టేట్ క్యాపిటల్‌గా మారుస్తానని చెప్పి డ్రగ్ క్యాపిటల్‌గా మార్చారని మండిపడ్డారు. దేశంలో ఎక్కడ గంజాయి పట్టుబడినా దానిమూలాలు ఆంధ్రప్రదేశ్‌లోని దొరుకుతున్నాయని, కల్తీ మద్యం మాఫియాతో ఇన్నాళ్ళు ప్రజల ఇళ్లు, ఒళ్ళు జగన్ నాశనం చేశాడని, ఇప్పుడు గంజాయి, డ్రగ్స్‌తో రాష్ట్రాన్ని డ్రగ్స్ కేపిటల్‌గా మారుస్తున్నారని, జగన్ రెడ్డి దోపిడిని యువత ప్రశ్నించకుండా నిలదీయకుండా ఉండటం కోసం మత్తులో దించి గేమింగ్, క్యాసినోతో యువత భవితను నిర్వీర్యం చేస్తూ తల్లిదండ్రులకు కడుపు కోత మిగులుస్తున్నాడని, దీనికి తగినంత మూల్యం జగన్ రెడ్డి చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ప్రాంతీయ పార్టీకి చెందిన ఎంపి విజయసాయిరెడ్డి బ్రెజిల్ దేశాధ్యక్షుడికి శుభాకాంక్షలు చెప్పాల్సిన అవసరం ఏంటని ప్రశ్నించారు. నేడు బ్రెజిల్ నుంచి వచ్చిన డ్రగ్ కంటైనర్‌తో జగన్ అండ్ కో మోసం బట్టబయలయిందని, దీని మీద సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి గుండాల లీలావతి, పార్లమెంట్ మహిళా ప్రధాన కార్యదర్శి మట్టం శ్రావణి రెడ్డి, కార్యదర్శి గుండాల భారతి, శ్రీపతి నరసమ్మ, నియోజకవర్గ అధ్యక్షురాలు తాళ్ళ సుబ్బమ్మ, పట్టణ అధ్యక్షురాలు గుండాల శ్రీదేవి, రూరల్ అధ్యక్షురాలు మల్లి శ్యామల, మాజీ కౌన్సిలర్లు కొడిపర్తి కల్పన, కస్తూరి, విజయమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## పెయిడ్ న్యూస్‌పై నిశితంగా పరిశీలన

*- కలెక్టరేట్‌లో ఎంసిఎంసిని పరిశీలించిన జిల్లా ఎన్నికల అధికారి సగిలి షన్మోహన్*

**చిత్తూరు, మార్చి 26 ప్రభాతవార్త:**
సార్వత్రిక ఎన్నికలు-2024కు సంబంధించి ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో వివిధ ప్రసార మాధ్యమాల్లో ప్రసారం అయ్యే పెయిడ్ న్యూస్‌పై నిశిత పరిశీలన చేయాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సగిలి షన్మోహన్ పేర్కొన్నారు. జిల్లా సచివాలయంలోని స్పందన హాలులో ఏర్పాటు చేసిన మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ(ఎంసిఎంసి) విధులను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పెయిడ్ న్యూస్‌కు సంబంధించి వివిధ ప్రసార మాధ్యమాల్లో వస్తున్న వార్తలను పరిశీలించి నమోదు చేయాలన్నారు. రాజకీయ పార్టీల అభ్యర్థులపై వస్తున్న అడ్వర్‌టైజ్‌మెంట్‌లను ఎప్పటికప్పుడు రిజిస్టర్లలో నమోదు చేయాలన్నారు. ఎలక్ట్రానిక్ మీడియా, సోషల్ మీడియా, ప్రైవేటు ఎఫ్‌ఎంల్లో ప్రసారార కోసం ఎనన్నికల కోడ్ అమలు రోజు నుండి ప్రింట్ మీడియాలో ప్రకటనల కోసం పోలింగ్ ముందు రోజులు, పోలింగ్ రోజున ప్రకటనల కోసం అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాల్లో ప్రసార అనుమతుల కోసం వచ్చే పొలిటికల్ అడ్వర్‌టైజ్‌మెంట్‌లను ఎన్నికల నిబంధనల మేరకు వున్నవి లేనివి పరిశీలించి ప్రీ సర్టిఫికేషన్ ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రీ సర్టిఫికేషన్ కోసం వచ్చే దరఖాస్తులను వరుస క్రమం ప్రకారం అనుమతులు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. ఎంసిఎంసి అనుమతులు లేకుండా ప్రసారం చేస్తే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ సగిలి షన్మోహన్ వెంట జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు, డిఆర్‌ఓ బి.పుల్లయ్య, ఎంసిఎంసి నోడల్ ఆఫీసర్ బి.నాగేశ్వరరావు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## అంతర్మధనంలో ఎమ్మెల్యే వరప్రసాదరావు అనుచరులు

**కోట, మార్చి 26 ప్రభాతవార్త**
బీజేపీ తిరుపతి ఎంపీ అభ్యర్థిగా కూటమి తరపున డాక్టర్ వెలగపల్లి వరప్రసాదరావు పేరు ఖరారైంది. ఆదివారం రోజే ఆయన బిజెపిలో చేరి వెంటనే టికెట్ ఖరారు చేసుకున్నారు. వాస్తవానికి వైసీపీ నుంచి గూడూరు ఎమ్మెల్యే టికెట్‌ను వరప్రసాదరావుకు నిరాకరించిన తర్వాత ఆయన జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్‌ను కలిశారు. జనసేనలో చేరుతారని ప్రచారం జరిగింది. జిల్లాలో జనసేన కేవలం తిరుపతి అసెంబ్లీ నుంచి మాత్రమే పోటీ చేస్తుండటంతో ఆయనకు ఎమ్మెల్యే టికెట్ ఇచ్చే అవకాశం లేదు. తిరుపతి ఎంపీ స్థానాన్ని బిజెపికి కేటాయించడంతో ఆయన బిజెపిలో చేరాలని నిర్ణయించుకున్నారు. ఆయన బిజెపిలో చేరిన వెంటనే తిరుపతి ఎంపీ టికెట్ కేటాయించారు. గతంలో ఆయన వైసీపీ నుంచి 2014లో తిరుపతి ఎంపీగా పోటీ చేసి గెలుపొంది ఉన్నారు. గూడూరు నియోజకవర్గంలో 2019 నుంచి 2024 వరకు ఆయన నియోజకవర్గంలో ఒక వర్గంతో సఖ్యతగా ఉంటూ వచ్చారు. ఈ నేపథ్యంలో ఆయనతో సఖ్యతగా ఉన్న నాయకులు, కార్యకర్తలు ప్రస్తుతం వైసీపీలో కొనసాగుతున్నారు. ప్రస్తుతం వీరు ఆయన వెంట నడుస్తారా అనేది సందిగ్ధంగా ఉంది. గూడూరు నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో వరప్రసాదరావు నాయకులను తయారు చేసుకున్నారు. ఇప్పటికే ఎమ్మెల్యే వరప్రసాదరావు కోట, వాకాడు మండలాలకు చెందిన పలువురు నాయకులకు ఫోన్ చేసి తనకు సహకారం అందించాలని కోరినట్లు తెలిసింది. అయితే తాము పడబోమని లోలోపల మీకు సహకారం అందిస్తామని చెప్తున్నట్లు సమాచారం.

# అధికారంలోకి రాగానే సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తా



## ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడు
## కుప్పంలో బాబు ష్యూరిటీ.. భవిష్యత్తు గ్యారెంటీ ప్రచారం

కుప్పం, మార్చి 26 ప్రభాతవార్త

అన్ని సమస్యలకు పరిష్కారం ఉంటుందని, రెండు నెలలు ప్రజలు ఓపిక పట్టాలని, అధికారంలో రాగానే అధికారంలో రాగానే సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తామని ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. మంగళవారం కుప్పం బాబునగర్‌లో బాబుష్యూరిటీ, భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా చంద్రబాబు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలో రాగానే ప్రతి మహిళకు ప్రతినెలా రూ 1500లు, చదివే ప్రతి పిల్లాడికి తల్లికివందనం కింద రూ 15వేలు, ఏటా మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందిస్తామన్నారు. అలాగే మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తామన్నారు. రైతులకు సాయం కింద ఏటా 20వేలు అందిస్తామన్నారు. నిరుద్యోగ యువతకు భృతికింద ప్రతినెలా మూడు వేలు ఇస్తామన్నారు. ఈసందర్భంగా పలువురు మహిళలు తమ ఇబ్బందులను చంద్రబాబు ఎదుట పేర్కొని ఆవేదన వ్యక్తం చేశారు. ధరల పెరుగుదలతో అవస్థలు పడుతున్నామని వాపోయారు. తెదేపాకు అనుకూలంగా ఉన్నామని పేర్కొంటూ తమ పెన్షన్లు తొలగించారని పలువురు వృద్ధులు పేర్కొన్నారు. అకారణంగా వైఎస్సార్సీ ప్రభుత్వం అర్హులైన లబ్దిదారులకు నిలిపేసిన సంక్షేమ పథకాలు తిరిగి అందిస్తామని చంద్రబాబు భరోసా ఇచ్చారు. ఈసందర్భంగా చంద్రబాబుకు మహిళలు మంగళహారతులు పట్టి ఘన స్వాగతం పలికారు. కార్యక్రమాల్లో ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్, చిత్తూరు ఎంపి అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావు, ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం, పరిశీలకుడు ఖాదర్ బాషా, రాష్ట్ర నేతలు డా॥ సురేష్‌బాబు, గోపీనాథ్, మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్, క్లస్టర్ ఇన్‌చార్జులు సత్యేంద్రశేఖర్, రవి, ప్రతాప్, మహిళా నేతలు భారతి, అనసూయ, సుగుణమ్మ, చంద్రకళ, వసంతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా అగ్నిగుండ మహోత్సవం



బాలాయపల్లి, మార్చి 26, ప్రభాతవార్త

పెరిమిడి గ్రామంలో వెలసియున్న శ్రీ పాండురంగ స్వామి దేవస్థానంలో 82వ అగ్నిగుండ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో భక్తులు నిగనిగ కాలే నిప్పులపైన నడిచారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేలాదిగా తరలివచ్చే పాండురంగ స్వామి వారిని దర్శించుకుని కొబ్బరికాయలు కొట్టి భక్తులు మొక్కలు తీర్చుకున్నారు. తీర్థప్రసాదాలు అందజేసినట్లు ఆలయ నిర్వాహకులు తెలియజేసారు. వైభవంగా పాండురంగ అగ్ని మహోత్సవం జరిగింది.

# టిడిపికి భారీ షాక్
## వైసిపిలో చేరిన డాక్టర్ మస్తాన్ యాదవ్

వెంకటగిరి టౌన్, మార్చి 26, ప్రభాతవార్త



సిఎం జగన్ సమక్షంలో వైసిపిలో చేరిన మస్తాన్ యాదవ్

తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా ఉన్న డాక్టర్ బలిగల మస్తాన్ యాదవ్ సిఎం జగన్మోహన్ రెడ్డి సమక్షంలో వైసిపి తీర్థం పుచ్చుకున్నారు. మస్తాన్ యాదవ్ వైసిపిలో చేరడంతో తెలుగుదేశం పార్టీకి భారీ షాక్ తగిలినట్లయింది. టిడిపి టికెట్ వస్తుందని ఆశించిన మస్తాన్ యాదవ్ టికెట్ రాకపోవడంతో నిరాశకు లోనై వైసిపిలో చేరారు. టిడిపిలో బీసీలకు తగు న్యాయం జరగడం లేదని ఆయన ఆందోళన చెందారు. వైసిపి జిల్లా అధ్యక్షులు రామ్ కుమార్ రెడ్డి సమక్షంలో ఆయన వైసిపిలో చేరాడు.

# తిరుపతికి మంచి కోసం జనసేన అభ్యర్థి గెలుపు అవసరం

## తిరుపతి, చిత్తూరుజిల్లాలపై అవగాహన ఉంది
## నేను తిరుపతివాసినేని వెల్లడించిన ఆరణి శ్రీనివాసులు



తిరుపతి, మార్చి 26ప్రభాతవార్త:

గత ఐదేళ్ళలో తిరుపతి పవిత్రనగరంలో భూకబ్జాలు, అక్రమాలు, రౌడీయిజం ఎంత పెరిగిపోయిందో ప్రజలకు తెలుసునని, తిరుపతి పవిత్రతను కాపాడుకోవడానికి ఎన్నికల్లో జనసేన పార్టీ అభ్యర్థి ఆరణి శ్రీనివాసులును ఎమ్మెల్యేగా గెలిపించుకోవాల్సిన అవసరం ఉందని ఆ పార్టీ అభ్యర్థి అన్నారు. ప్రజల మద్దతు తనకు ఉంటుందని, అభివృద్ధి, శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజలకు మంచిచేయడం అంటే చేతులతో చూపిస్తానన్నారు. ప్రజల సంతోషమే తనకు ముఖ్యమన్నారు. పార్టీ కంటే తిరుపతి ప్రజలు తనకు కుటుంబసభ్యులన్నారు. మంగళవారం తిరుపతిలో జనసేన పార్టీ అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు, జిల్లా ఇన్‌ఛార్జి డాక్టర్ హరిప్రసాద్, తిరుపతి నగర అధ్యక్షుడు రాజారెడ్డితో కలిసి మీడియాతో మాట్లాడారు. బుధవారం ఉదయం 9గంటలకు కపిలేశ్వరస్వామిని దర్శించుకుని ప్రచారంప్రారంభిస్తానన్నారు. తాను క్లాస్ 1కాంట్రాక్టర్‌అని, నాకు జిల్లాపై పూర్తిపట్టు ఉందన్నారు. తిరుపతిలో పోటీచేసే అవకాశం కలగడం శుభపరిణామమని, ఇక్కడ టిడిపి, జనసేన, బిజెపినేతలతో కలసి ప్రచారం చేస్తానన్నారు. ప్రజల మద్దతుతతో అఖండమెజార్టీ లభిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రజారాజ్యం, టిడిపి, వైసిపి జిల్లా అధ్యక్షుడుగా పనిచేసిన అనుభవం ఉందన్నారు. రాష్ట్రపార్టీ అధినేత పవన్‌కల్యాణ్, టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు అచ్చన్నాయుడు టిడిపి నేతలు, జనసేనపార్టీ నేతలు కలసి పనిచేసి ఐక్యంగా గెలుపుముఖ్యమన్నారు. జనసేనలోనే అందరూ కలసి ఉన్నామని, విడిపోలేదన్నారు. తిరుపతిలో శ్రీనివాసులును గెలిపించి పవన్‌కల్యాణ్‌కు బహుమతిగా ఇద్దామన్నారు.

## ఒక్కఛాన్స్‌తో జగన్ ప్రజలకు
# మరణశాసనం రాశారు
## - తెదేపా అధినేత చంద్రబాబునాయుడు
### బాబు సమక్షంలో తెదేపాలోకి భారీగా చేరికలు !!



కుప్పంరూరల్, మార్చి 26 ప్రభాతవార్త

2019లో ఒక్కఛాన్స్ అంటూ అధికారంలో వచ్చిన సిఎం జగన్ రాష్ట్ర ప్రజలకు మరణ శాసనం రాశారని తెదేపా అధినేత చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక కెఆర్ కళ్యాణ మండపంలో చంద్రబాబు సమక్షంలో తెదేపాలోకి కొత్తపేట వాసు, డా॥ ఆశాజ్యోతి, రిటైర్డ్ సిఐ రాజేంద్రప్రసాద్, నాగరాజు, డా॥ సొహైల్, మానవహక్కుల సంఘం నేత జలపతి, శ్రీనివాసులు, భాస్కర్‌తో పాటు కుప్పం, గుడుపల్లె, రామకుప్పం, శాంతిపురం మండలాలకు చెందిన కార్యకర్తలు అధిక సంఖ్యలో చేరారు. ఈసందర్భంగా చంద్రబాబు వారికి పార్టీ కండువాలు కప్పి స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈఎన్నికల్లో ప్రజలు గెలిస్తే రాష్ట్రం నిలుస్తుందన్నారు. వైకాపాకు ఓట్లేస్తే ఏమవుతుందో ప్రతి ఒక్కరూ ఆలోచించాలన్నారు. వైకాపా దిగిపోతే ప్రజలు సుఖంగా ఉంటారన్నారు. ప్రజల అభివృద్ధి, సంక్షేమాన్ని రాజకీయాలే నిర్ణయిస్తాయన్నారు. దానికి తగ్గ నాయకుల్ని ఎన్నుకుంటేనే భవిష్యత్తు ఉంటుందన్నారు. పార్టీ కోసం కష్టపడేవారికి తప్పక గుర్తింపు ఉంటు ఒదన్నారు. కార్యక్రమాల్లో ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్, ఎంపి అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావు, ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం, పరిశీలకుడు ఖాదర్ బాషా, రాష్ట్రనేతలు డా॥ బిఆర్ సురేష్‌బాబు, గోపీనాథ్, మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్, పార్టీ విస్తరణ కమిటీ సభ్యుడు కన్నన్, మైనార్టీ నేతలు అన్సర్, సర్దార్, జాకీర్, సీనియర్ నేత ఆర్.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# టిడిపిలో ఆర్వీటిబాబు పున: ప్రవేశం

పుంగనూరు, మార్చి 26 ప్రభాతవార్త :



ఆర్వీటి బాబును పార్టీలోనికి ఆహ్వానిస్తున్న చంద్రబాబు

పట్టణ యువకులకు మార్గదర్శిగా ఎన్నెన్నో ప్రజాసేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిన యువ పారిశ్రామికవేత్త, సంచలన విజయాల కారకుడు ఆర్వీటి బాబు తెలుగుదేశం పార్టీలో పున:ప్రవేశం చేయడంతో పట్టణంలో యువకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పట్టణాన్ని చెందిన ఆర్వీటి బాబు గతంలో తెలుగుదేశం పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరించేవారు. ఈక్రమంలో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రాబల్యంపెరగడంతో పాటూ ఆయన ఒత్తిడితో పదేళ్ళక్రితం వైకాపాలో చేరారు. అయితే, ఆర్వీటిబాబు తాను వైకాపాలో చేరినా, స్థానికంగా కొందరు నాయకుల వల్ల పెద్దాయనకు దూరంగా ఉండిపోయారు. గత ఐదేళ్ళుగా స్తబ్దుగా ఉన్న ఆర్వీటి బాబును చంద్రబాబు తన పర్యటనలో భాగంగా కుప్పంకు సోమవారం పిలుపునిచ్చి రప్పించారు. కుప్పంలోని తన పార్టీ కార్యాలయంలో ఆర్వీటిబాబుతో సంప్రదించిన తరువాత ఆయన సేవలు పార్టీకు అవసరమని ఒప్పించి, తిరిగి పార్టీలోనికి ఆహ్వానిస్తూ కండువా కప్పారు. ఆర్వీటిబాబు పార్టీలోనికి రావడాన్ని పార్టీ అభ్యర్థి చల్లాబాబుతో పాటూ, పార్టీశ్రేణులు ఆహ్వానించాయి.

# సుస్థిర మంచిపాలన కోసం బిసివై పార్టీని ఆదరించండి : ఆర్‌సివై

చౌడేపల్లి, మార్చి 26 ప్రభాతవార్త



ప్రసంగిస్తున్న బోడె రామచంద్రయాదవ్

సుస్థిర, మంచి పాలన కోసం భారత చైతన్య యువజన పార్టీ (బిసివై)ని ఆదరించాలని ఆపార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు బోడె రామచంద్ర యాదవ్ అన్నారు. మంగళవారం బిసివై ఆధ్వర్యంలో స్కూటర్ ర్యాలీ, స్థానిక బస్టాండులో బహిరంగ సభ జరిగింది. ప్రశాంతతకు మారు పేరుగా వున్న పుంగనూరులో ప్రస్తుతం అరాచక శక్తులు రాజ్యమేలుతున్నారన్నారు. గత 5యేళ్ళుగా నియోజకవర్గంలో ప్రశ్నించే వారిపై అక్రమంగా కేసులు బనాయించడం, దాడిచేయడం పరిపాటిగా మారిందన్నారు. సామాన్య కార్యకర్త నుంచి ప్రతిపక్ష నేత వరకు దాడులకు పాల్పడి, నెలల తరబడి జైళ్ళల్లో పెట్టిస్తున్నారని ఆరోపించారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపి పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిలపై ఘటాయిన విమర్శలు చేసారు. హంద్రీ-నీవానీటిని కుప్పం తీసుకెళ్ళి పుంగనూరు రైతుల కడుపు కొట్టారన్నారు. యేటా నియోజకవర్గ యువత పొట్ట చేతపట్టుకొని పొరుగు రాష్ట్రాలకు వెళ్ళడం ప్రభుత్వానికి కనబడలేదాని ప్రశ్నించారు. వ్యవసాయ, పాడిపరిశ్రమ రంగాలు దెబ్బతిన్నాయనీ, ప్రాజెక్టుల పేరుతో దోచుకోవడం ట్రిబ్యునల్ ప్రభుత్వానికి మొట్టికాయ వేయడాన్ని ప్రజలు, రైతులు గమనిస్తూనే వున్నారన్నారు. వైకాపా, టిడిపి చీకటి ఒప్పందాల మూలంగా రాష్ట్రాన్ని, పుంగనూరు నియోజకవర్గాన్ని భ్రష్టు పట్టిస్తున్నారని విమర్శించారు. బిసివైపార్టీ ప్రజారంజక మేనిఫెస్టోని వివరించారు. బిసివై పార్టీ హరినాథ్‌రెడ్డి, సాంబమూర్తి, రమేష్‌యాదవ్, ఆనందబాబు, గిరిబాబు, మైనార్టీ నాయకులు అల్లాభక్షు, మున్నా, కార్యకర్తలు పాల్గొన్నారు. కాగా బిసివైపార్టీ బహిరంగ సభలో జానపద నృత్యాలు ఆకట్టుకున్నాయి.

# సుబ్రమణ్యస్వామికి విశేష అభిషేకాలు..అలంకరణ
## -పరవశించిన భక్తజనం

శ్రీకాళహస్తి, మార్చి 26 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో అధ్యాత్మిక చింతన వెల్లి విరుస్తుంది. ధార్మిక దివ్యక్షేత్రంలో ప్రతి రోజూ ధార్మిక కార్యక్రమాలతో తుల తూగుతుంది. స్థానిక భక్తులే కాకుండా దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు కూడా ఆధ్యాత్మిక చింతతనలో తన్మయత్వం పొందుతున్నారు. మంగళవారం సుబ్రమణ్యం స్వామి ఆలయాలు కిట కిటలాడాయి. అయితే భక్తుల తాకిడిని బట్టి ఆలయాధికారులు భక్తులు ఏ ఆలయం వద్ద అధికంగా ఉంటున్నారో అక్కడ సదుపాయాలు కల్పిస్తున్నారు. ఆలయంలో చెంగల్వరాయస్వామి ఆలయం వద్ద విశేష పూజలతో పాటు అలంకారాలు నిర్వహించారు. హారతి ఇవ్వటానికి ప్రత్యేక అర్చకుని ఏర్పాటు చేసారు.

### నాలుగు చెరుగులా ఆధ్యాత్మికత:

పట్టణానికి ఓ వైపు దుర్గంబా కొండ మరో వైపు సుబ్రమణ్యం స్వామి ఆలయం కుమారస్వామి తిప్పగా వెలసి భక్తుల కొంగుబంగారంగా విరాలజిల్లుతుంది. మంగళవారం పట్టణంలోని సుబ్రమణ్యం స్వామి ఆలయాలు భక్తులతో కిట కిట లాడుతున్నాయి. ఈ నేపధ్యంలో శ్రీకాళహస్తి పట్టణంలోని తేరువీధిలో వెలసిన షణ్ముఖ స్వామి ఆలయం అలాగే శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఉన్న కుమారస్వామి కొండపై వెలసిన సుబ్రమణ్యం స్వామి ఆలయం, శ్రీకాళహస్తీశ్వరాలయంలో రంగుల గోపురం పక్కన వెలసిన స్వామి, ఆలయంలోని చెంగల్వరాయస్వామి ఆలయంలో విశేషాభిషేకాలు నిర్వహించారు. ముఖ్యంగా తేరువీధిలో వెలసిన 'షణ్ముఖ స్వామి' ఆలయంలో స్వామికి షోడషాభిషేకాలు నిర్వహించారు. వందలాది లీటర్ల పాలు, పెరుగు, తేనే, విభూది, గంధం, కుంకుమ, పసుపు, సకల సుగంధ ద్రవ్యాలతో పూజలు అభిషేకాలు నిర్వహించారు. చూపరులను ఇట్టు ఆకట్టుకునే రీతిలో అర్చకులు ప్రసాద్, మురళిలు తీర్చి దిద్దుతున్నారు.

### షణ్ముఖ స్వామి ఆలయానికి పొటెత్తున్న భక్తులు:

శ్రీకాళహస్తి పట్టణంలోనూ, ఆలయంలో పలు సుబ్రమణ్యం స్వామి ఆలయాలున్నాయి. అయితే తేరువీధిలో ఆలయప్రధానార్చకులు స్వర్గీయ బాబు గురుకుల్స్‌కు చెందిన ఆలయం షణ్ముఖ స్వామి ఆలయం. ఇక్కడ సుబ్రమణ్యం స్వామి ఆరుముఖాలతో వెలసి దర్శనమిస్తున్నారు. ఈ ఆలయం పట్టణ నడిబొడ్డులో ఉండటంతో ఇక్కడకు పట్టణ నలు మూలల నుంచి భక్తులు తండోపతండాలుగా కదలి వస్తున్నారు. భక్తులు ప్రతి ఒక్కరు పాలను, పెరుగును అందిస్తున్నారు. వాటితో అభిషేకాలు నిర్వహిస్తున్నారు. ఇక ఇక్కడ స్వాములు నిర్వహిస్తున్న అలంకారాలు ఇట్టే ఆకట్టుకుంటున్నాయి. ఇక భక్తులు వచ్చిన వారికి దాన ధర్మాలు చేస్తున్నారు. ఇక్కడ వెలసిన వినాయకుడు మహిమాన్వితుడని చెబుతారు. ఉదయం సూర్యోదయం నుంచి రాత్రి 9గంటల వరకు ఈ ఆలయంలో విశేష పూజలు, అలంకారాలు నిర్వహిస్తున్నారు. కాగా ఆలయంలోని రంగుల గోపురం పక్కనే వల్లిదేవసేన సమేత సుబ్రమణ్యం వెలసి భక్తుల కొంగుబంగారంగా వరాలిస్తున్నారు. ముఖ్యంగా ఇక్కడి ఆలయాల్లో కణితలు వచ్చిన వారు స్వామికి బెల్లం ముద్దలను నైవేద్యంగా పెట్టి పట్టణ నడిబొడ్డులోని నారద పుష్కరిణిలో వేస్తున్నారు. కొన్ని వారాలకు వారికి నయం అవుతుందనే నమ్మకం ఉంది.



# ప్రయివేట్ గోదాములో ఎన్నికల ప్రచార సామాగ్రి

రేణిగుంట, మార్చి 26, ప్రభాతవార్త

రేణిగుంట విమానాశ్రయం వెళ్లే మార్గంలోని ఓ ప్రయివేట్ గోదాము, మరో లారీలో అధికార పార్టీకి చెందిన ఎన్నికల ప్రచార సామాగ్రిని అధికారులు మంగళారం గుర్తించారు. లారీలో ఎన్నికల ప్రచార సామాగ్రి ఉన్నట్లు అనుమానంతో టిడిపి నేతలు నరసింహయాదవ్, చెర్లోపల్లి సుబ్రమణ్యంరెడ్డి, మునిచంద్రారెడ్డి, మహబూబ్‌బాసా, భాస్కర్‌రెడ్డిలు గోదాము వద్ద లారీని అడ్డుకున్నారు. వెంటనే అధికారులకు ఫిర్యాదు చేశారు. హుటాహుటిన ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి అక్కడ చేరుకున్నారు. రేణిగుంట తహసిల్దార్ నాగేశ్వరరావు రెవిన్యూ సిబ్బందితో స్వాధీనం చేసుకున్నారు. విలువ నిర్ధారించే ప్రయత్నంలో నిమగ్నమయ్యారు.

# అధిష్టానం నిర్ణయంతో కంచుకోటకు బీటలు వారనుందా..?
## అభ్యర్థి మార్పుతో నిరసిస్తూ రోడ్డెకుతున్న తెలుగు తమ్ముళ్లు..

సత్యవేడు, మార్చి 26, ప్రభాతవార్త

1982లో పార్టీ ఆవిర్భావం తర్వాత తెలుగుదేశం పార్టీకి కంచుకోటగా ఏర్పడిన సత్యవేడు నియోజకవర్గానికి బీటలు వారనుందా అంటే అధిష్టానం ఏకపక్ష నిర్ణయాల వలన అంటున్నారు తెలుగు తమ్ముళ్ళు.. సార్వత్రిక ఎన్నికలు జరిగిన ప్రతి సారి కొత్త అభ్యర్థిని తీసుకువచ్చి దాదాపుగా విజయాడంకా మోగిస్తున్నప్పటికీ ఈ సారి అధిష్టాన నిర్ణయాన్ని స్వాగతించడం లేదు..

### అధిష్టాన నిర్ణయాన్ని వ్యతిరేకించడానికి కారణం..?

వైసిపి ప్రభుత్వంలో పనిచేసిన ఎమ్మెల్యే తెలుగుదేశం పార్టీ అధిక నాయకుడి పట్ల ఆయన మాట్లాడిన తీరు క్యాడర్ పట్ల ఆయన పేరు చెప్పుకుని వైసిపి నాయకులు చేసిన అరాచకాలను మర్చిపోకముందే ఆ ఎమ్మెల్యేకే మళ్ళీ టిడిపిలో టికెట్ కేటాయించడంతో అధిష్టానంపై నాయకులు, కార్యకర్తలు అసహనంతో ఉన్నారు.

### అభ్యర్థి మార్పు తప్పదా..?

15 నెలలు క్రితం స్వయంగా పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు ఇంచార్జిగా ప్రకటించడంతో సత్యవేడు నియోజకవర్గ బాధ్యతలు చేపట్టిన హేమలత పార్టీలో అంతర్గతంగా ఒడిదుడుకులు ఉన్నప్పటికి ఆర్థికంగా ఖర్చుపెడుతూ పార్టీ కార్యక్రమాలను చేస్తూ ప్రజలలోకి వెళ్లారు. అయితే ఊహించని విధంగా ప్రస్తుతం వైసిపి ఎమ్మెల్యే ఆదిమూలంకి టికెట్ కేటాయించడంతో నియోజకవర్గంలోని నాయకులు అధిష్టాన నిర్ణయాన్ని స్వాగతించినప్పటికి, కార్యకర్తలలో, ప్రజలలో వ్యతిరేకతలు రావడంతో అధిష్టానం పునరాలోచనలో పడినట్లు తెలుస్తుంది..

### ఏ ముఖం పెట్టుకుని పని చేయ్యాలి..?

ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం లోకేష్ బాబుని మాత్రమే కలిశారు. కాని అధికారికంగా పార్టీలో ఎక్కడా చేరలేదని, పార్టీ టికెట్ కేటాయించిన అధినాయకుడిని కృతజ్ఞతాపూర్వకంగా కూడా ఇప్పటి వరకు కలవలేదని, బలమైన కారణం వల్లనే ఆయనకు టికెట్ కేటాయించారని, వైసిపి ప్రభుత్వంలో ఉమ్మడి పార్టీ నాయకులు, కార్యకర్తలపై రౌడీ షీట్‌లు, కేసులు పెట్టించుకొని ఆర్థికంగా ఇబ్బందులు పడ్డ తాము ఇప్పుడు గ్రామాల్లో ఏ ముఖం పెట్టుకుని పార్టీకి పనిచేయాలని టిడిపి కార్యకర్తలు బహిరంగానే విమర్శిస్తున్నారు.

# వెంకటగిరి వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి టికెట్ రేసులో పోణకా దేవసేనమ్మ..?
## అధిష్టానం నుంచి పిలుపు - మద్దతు పలుకుతున్న స్థానికులు

గూడూరు, మార్చి 26, ప్రభాతవార్త

వెంకటగిరి వైసిపి అభ్యర్థిగా నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి పేరు ఖారారైన విషయం తెలిసిందే.. కానీ రామ్ కుమార్ రెడ్డి పేరు ఖరారైనప్పటి నుంచి అసంతృప్తి సెగలు ఊపందుకున్నాయి. దీంతో పాటు సర్వేలతో పాటు గడప గడపకి వైసిపి కార్యక్రమంలో ఆయన విఫలమయ్యారు. వెంకటగిరికి పెద్ద దిక్కు అయిన రాజాలు, ప్రముఖ నాయకులు కలిమిలి రాంప్రసాద్ రెడ్డితో పాటు పలువురు జడ్పిటిసి, ఎంపిటిసిలు రాంకుమార్ రెడ్డికి వ్యతిరేక వర్గంగా మారారు. ఈ మేరకు ఇటీవల మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రరెడ్డికి వినతి పత్రం అందజేసారు. అయినప్పటికి వైసిపి అధిష్టానం బేఖాతరు చేస్తూ అధిష్టానం ఎమ్మెల్యే అభ్యర్థిగా రామ్ కుమార్ రెడ్డిని ప్రకటించడం జరిగింది. ప్రస్తుత పరిస్థితుల్లో అన్ని పార్టీలు ఒక్కటై వైసిపిపై దాడికి దిగడంతో వైసిపి అధిష్టానానికి ప్రతి సీటు కీలకంగా మారింది. ఈ క్రమంలో రామ్ కుమార్ రెడ్డి పై తీవ్ర వ్యతిరేకత వ్యక్తం అవ్వడంతో ఆయనను తప్పించి అందరికి సుపరిచితురాలైన రాష్ట్ర స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్ పర్సన్ పోణకా దేవసేనమ్మకు వైసిపి అధిష్టానం గ్రీన్ సిగ్నల్ ఇస్తూ ఆమె పేరు ఖరారు చేసిందుకు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. ఈ మేరకు వారికి అధిష్టానం నుంచి పిలుపు అందినట్లు విశ్వసనీయ సమాచారం. వెంకటగిరి రాజాలకు నియోజకవర్గంలో మంచి పట్టు ఉంది. వారు కూడా ఆమెకి టికెట్ ఇస్తే తమ మద్దతు ప్రకటిస్తున్నట్లు సమాచారం. అలాగే పురపాలక సంఘ మాజీ చైర్ పర్సన్ దొంతు శారద, నాయకులు మెట్టుకూరు ధనుంజయ రెడ్డి, కలిమిలి రాంప్రసాద్ రెడ్డిలతో పాటు మండలంలో మైనింగ్ వ్యాపారాలు చేస్తున్న ప్రముఖులు కూడా శివకుమార్ రెడ్డికి సన్నిహితులు కావడంతో వారి మద్దతు కూడా మెండుగా ఉన్నాయి. ఇలా నియోజకవర్గంలో ఈ స్థాయి మద్దతు కూడకట్టుకున్న పోణకా దేవసేనమ్మ భరిలో దిగుతుండడంతో టిడిపి అభ్యర్థి పరిస్థితి తారుమారు అయ్యేలా ఉన్నాయని రాజకీయ విశ్లేషకులు అంటున్నట్లు సమాచారం. అలాగే వెంకటగిరి టికెట్ టిడిపి తరపున ఆశించి భంగపడిన టిడిపి రాష్ట్ర కార్యదర్శి మస్తాన్ యాదవ్ రాజీనామ చేయడంతో టీడీపీ వర్గీయులు సందిగ్ధంలో పడ్డారు. మస్తాన్ యాదవ్ కూడా పోణకా దేవసేనమ్మకి మద్దతు తెలిపేందుకు సిద్ధంగా ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. అదే విధంగా సోమవారం ఎన్‌డిసిసి మాజీ చైర్మన్ మెట్టుకూరు ధనంజయ రెడ్డి వెంకటగిరి ఎమ్మెల్యే టికెట్ కోసం గట్టి ప్రయత్నాలు చేపట్టడం జరుగుతుందని రాంకుమార్ రెడ్డికి ఎమ్మెల్యే టికెట్ ఖరారు చేయడంతో వేలాదిమంది ధనంజయ రెడ్డి అభిమానులు బైక్ ర్యాలీ నిర్వహించి వ్యతిరేక నినాదాలు చేయడం జరిగింది. రాంకుమార్ రెడ్డిపై వెంకటగిరి టికెట్ పై వైసిపిలో బాగా దుమారం రేపడం అధిష్టానానికి తలనొప్పిగా మారడం జరిగింది. దీనిపై అధిష్టానం ఎంత వరకు నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాల్సిందే..



పోణకా దేవసేనమ్మ దంపతులు ఫైల్ ఫోటో